మత్తేరిమిట్టకు మహర్దశ



నాడు శిథిలదశలో మత్తేరిమిట్ట పంచాయతీ కార్యాలయం, నేడు నూతన హంగులతో నిర్మించిన సచివాలయ భవనం

- ఓవైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమ పథకాలు
- నాలుగేళ్లలో మారిన స్వరూపం
- ప్రత్యక్ష, పరోక్ష ప్రయోజనాల కోసం రూ. 24.52 కోట్ల ఖర్చు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన వలంటీర్లు, సచివాలయ వ్యవస్థలతో కష్టాలు తీరాయి.. ఇంటికే పింఛన్ తెచ్చి ఇస్తున్నారు..మా బాగోగులు చూస్తున్నారు.. పథకాల కోసం ఎవరి చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు.. పింఛన్, అమ్మఒడి, రైతు భరోసా, వాహనమిత్ర, రేషన్ కార్డులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వలంటీర్ల సహకారంతో మంజూరవుతున్నాయి.. మండలంలోని మత్తేరిమిట్ట గ్రామస్తులను పలకరిస్తే చెప్పే మాటలివి. అంతేకాక ఉన్న ఊర్లోనే సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లకు భవన నిర్మాణాలు పూర్తి కావడంతో గ్రామం నూతన శోభను సంతరించుకుంది.

వరదయ్యపాళెం: నాడు గ్రామ పంచాయతీ కార్యాలయ భవనానికి నోచుకోని మండలంలోని మత్తేరిమిట్ట గ్రామంలో నేడు కళ్లు చెదిరే భవంతులతో అభివృద్ధి పరుగులు పెడుతోంది. గ్రామంలో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులు పూర్తిస్థాయిలో నిర్మాణాలు రూపుదిద్దుకున్నాయి. రూ. 40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ. 21 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ. 18 లక్షలతో మంజూరు చేసిన విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. ఇటీవల రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రూ.40లక్షలతో డ్రైనేజీ కాలువలను నిర్మించారు. మరో రూ. 20లక్షలతో సిమెంటు రోడ్లు నిర్మాణం చేపట్టారు.


నాడు-నేడులో మెరుగులు అద్దుకున్న పాఠశాల

రూ. 27లక్షలతో నాడు–నేడు పనులు

మత్తేరిమిట్ట ప్రాథమికోన్నత పాఠశాలలో నాడు-నేడు పనుల్లో భాగంగా రూ. 27లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టారు. ఇందులో రూ.14లక్షలతో మౌలిక వసతులు, రూ.13లక్షలతో ప్రహరీ గోడ పనులను పూర్తి చేశారు. దీంతో కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాల తుది మెరుగులు దిద్దుకుంది.

పరోక్ష ప్రయోజనాలు

ఇంటి స్థలాలు	96	2,36,16,000
జగనన్న విద్యాకానుక	304	21,59,008
8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ	46	6,08,212
జగనన్న తోడు	28	5,21,332
జగనన్న గోరుముద్ద	285	28,23,495
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	359	67,24,070
ఇంటింటికీ రేషన్	1446	3,15,86,424
పరోక్ష ప్రయోజనాలు మొత్తం	---	6,80,38,541
ప్రత్యక్ష, పరోక్ష మొత్తం	---	24,52,38,142


వైఎస్సార్ హెల్త్ క్లినిక్



అందుబాటులోకి వచ్చిన రైతు భరోసా కేంద్రం

మత్తేరిమిట్ట సచివాలయ పథకాల వివరాలు

ప్రత్యక్ష నగదు బదిలీ

పథకం	లబ్ధిదారులు	అందిన లబ్ధి (రూపాయల్లో)
జగనన్న అమ్మఒడి	488	2,12,88,077
జగనన్న విద్యాదీవెన	267	71,75,031
జగనన్న వసతి దీవెన	207	34,18,074
వైఎస్సార్ రైతు భరోసా	360	1,81,03,000
వైఎస్సార్ ఉచిత పంటల బీమా	02	2,043
వైఎస్సార్ సున్నావడ్డీ	58	1,26,016
రైతన్నకు సాయం		
రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ	07	1,04,285
వైఎస్సార్ పెన్షన్ కానుక	643	6,17,65,500
వైఎస్సార్ చేయూత	377	1,61,25,000
వైఎస్సార్ ఆసరా	808	2,57,10,208
వైఎస్సార్ సున్నావడ్డీ	1074	47,47,763
మరిన్ని పథకాలు		
వైఎస్సార్ కాపు నేస్తం	02	30,000
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	07	2,10,000
వైఎస్సార్ కల్యాణమస్తు	01	1,00,000
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	100	35,71,205
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	59	3,88,850
హౌసింగ్ (లబ్ధిదారులకు	82	1,07,79,161
ప్రత్యక్ష చెల్లింపులు		
వైఎస్సార్ బీమా	06	13,00,000
వైఎస్సార్ వాహనమిత్ర	37	9,40,000
జగనన్న చేదోడు	01	10,000
తెల్ల రేషన్ కార్డుదారులకు	1293	12,93,000
జగనన్న తోడు (వడ్డీ)	18	12,388
ప్రత్యక్ష నగదు బదిలీ (మొత్తం)	---	17,71,99,601

అన్ని వర్గాలకు ప్రభుత్వం అండ



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత పాలనలో తన ప్రత్యేకతను చాటుకున్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో ప్రజల ముంగిటకు ప్రభుత్వ పాలన తెచ్చారు. గ్రామస్థాయిలోని ప్రభుత్వ పథకాలతో పాటు సేవలను అందిస్తున్నారు. రైతు భరోసా కేంద్రం ద్వారా రైతులకు ఎరువులు, విత్తనాలు అందిస్తున్నారు. వెల్‌నెస్ సెంటర్ ద్వారా గ్రామంలోనే వైద్యసేవలు అందుకుంటున్నారు. మహిళలు, రైతులు, విద్యార్థులకు, ఇంకా అన్ని వర్గాల ప్రజలకు సీఎం అండగా నిలుస్తున్నారు.

–హరిబాబురెడ్డి, మత్తేరిమిట్ట

ఇంటికే వచ్చి పింఛన్ ఇస్తున్నారు



జగన్ బాబు అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతినెల 1వ తేదీన తెల్లవారే సరికి వలంటీర్ ఇంటికే వచ్చి పింఛన్ నగదు ఇస్తున్నారు. గతంలో పింఛన్ డబ్బులు ఇచ్చే అధికారి ఎప్పుడు వస్తారో అని పంచాయతీ కార్యాలయం వద్ద ఎదురు చూసేవాళ్లం. దీనికి తోడు పింఛన్‌దారులు అందరూ ఒకేసారి రావడంతో క్యూలో నిలబడాల్సి వచ్చేది. మాకు ఇప్పుడు ఆ కష్టాలు లేకుండా చేసిన జగన్ బాబు చల్లగా ఉండాలి.

–రామమ్మ, పింఛన్ లబ్ధిదారురాలు

క్లుప్తంగా

సిపాయి భరోసా అందజేత


సరకులుఅందజేస్తున్న ఎమ్మెల్సీ సుబ్రమణ్యం

ఏర్పేడు: మండలంలోని రావిళ్లవారికండ్రిగ ఎస్టీ కాలనీకి చెందిన రాణెమ్మ కుటుంబ సభ్యులకు ఆదివారం సిపాయి భరోసా సాయాన్ని అందజేశారు. రాణెమ్మ(54) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం ఆ గ్రామానికి వెళ్లి తన ఆధ్వర్యంలో నడుస్తున్న సిపాయి భరోసా కింద ఏడాదికి సరిపడే 40 రకాల నిత్యావసర సరకులను అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు గోపీ యాదవ్, రాజశేఖర్, సుబ్రమణ్యం, హరీఫ్ భాషా, శేఖర్, రమేష్, గోవింద స్వామి తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతల పంపిణీ


చెల్లూరులో అక్షింతల పంపిణీ

ఏర్పేడు: మండలంలోని పలు గ్రామాల్లో విశ్వ హిందూ పరిషత్ సభ్యుడు ఆదూరి శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం అయోధ్య అక్షింతల పంపిణీ జరిగింది. చెల్లూరు, నచ్చనేరి తదితర గ్రామాల ఆలయాల్లో పూజలు నిర్వహించి అక్షింతలతో పాటు శ్రీరాముని చిత్ర పటాన్ని గ్రామస్తులకు అందజేశారు.

వైభవంగా మాతమ్మ విగ్రహ ప్రతిష్ట


విశేషాలంకరణలో మాతమ్మ దేవత

రేణిగుంట: మండలంలోని విప్పమానుపట్టెడ గ్రామంలో ఆదివారం మాతమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ట శాస్త్రోక్తంగా నిర్వహించారు. 15 ఏళ్లుగా పూజలకు నోచుకోని ఈ ఆలయంలో సర్పంచ్ లక్ష్మీపతి సహకారంతో గ్రామస్తులు విగ్రహాన్ని ప్రతిష్టించారు. తొలుత గ్రామ వీధుల్లో మేళ,తాళాల నడుమ అమ్మవారి విగ్రహాన్ని ఊరేగించారు. అనంతరం హోమపూజలు చేశారు. వేద మంత్రోచ్చారణల నడుమ విగ్రహ ప్రతిష్ట చేశారు. భక్తులు పొంగళ్లు పెట్టి నివేదించారు. గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

లీకేజీల నియంత్రణ


పైప్‌లైన్‌కు మరమ్మతులు

రేణిగుంట: పట్టణంలో ఎక్కడా తాగునీటి పైప్ లైన్ లీకేజీ లేకుండా చర్యలు తీసుకుంటామని సర్పంచ్ నగేషం అన్నారు. మండలంలోని గౌరీనగర్‌లో ఆదివారం తాగునీటి పైపు పగిలి నీరు రోడ్డుపై వృథాగా పారింది. విషయం తెలుసుకున్న సర్పంచ్ పంచాయతీ సిబ్బందితో కలసి అక్కడికి చేరుకుని పైప్‌లైన్ మరమ్మతులు చేయించి లీకేజీని అరికట్టారు. రానున్న వేసవి దృష్ట్యా పట్టణంలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ చర్యలను తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు.

డ్రోన్‌తో పిచికారీ సులభతరం


పిచికారీ విధానాన్ని వివరిస్తున్న ఏఓ

శ్రీకాళహస్తి : పంటలకు డ్రోన్ ద్వారా పురుగు మందులను పిచికారీ చేయడం సులభతరమని మండల వ్యవసాయాధికారి సురేంద్రరెడ్డి అన్నారు. తొట్టంబేడు మండలం బోనుపల్లె రైతుభరోసా కేంద్రం పరిధిలోని కంచనపల్లెలో ఆదివారం డ్రోన్‌తో పిచికారీ చేయడంపై రైతులకు అవగాహన కల్పించారు. పొలంలో డ్రోన్‌తో పిచికారీని ప్రయోగాత్మకంగా చేసి చూపారు. ఏవో మాట్లాడుతూ మనిషి అవసరం లేకుండా పురుగు మందులను పిచికారీ చేయడం డ్రోన్‌తో సాధ్యమవుతుందన్నారు. పురుగు మందు వృథా కాకుండా పంటచేలు పైన మాత్రమే పిచికారీ చేసుకోవచ్చన్నారు. తక్కువ సమయంలో ఎక్కువ ప్రాంతంలో పిచికారీ చేసుకునే వీలు ఉంటుందని తెలిపారు. వరిపైరును ఎక్కువగా సుడిదోమ ఆశించినట్లు గుర్తించిన ఆయన, మెట్రోజైన్, బ్యూప్రోఫెజిన్ వంటి పురుగు మందులను పిచికారీ చేసుకోవడం ద్వారా తెగుళ్లను నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

అంతా రామమయం..


అంజిమేడులో ముస్తాబైన రామాలయం


శ్రీకాళహస్తి: శుద్ధి కార్యక్రమంలో బీజేపీ నాయకులు

ఏర్పేడు: అయోధ్యలో సోమవారం శ్రీరామమందిర ప్రాణప్రతిష్ట సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో రామాలయాలు ముస్తాబయ్యాయి. అంజిమేడు, పాపానాయుడుపేట, మేర్లపాక, బండారుపల్లె, మన్నసముద్రం, మర్రిమంద తదితర గ్రామాల్లో ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. అయోధ్య శ్రీరామ మందిర ప్రాణప్రతిష్ట జరిగే సమయంలో నిర్వహించే పూజల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. చలువ పందిళ్లు, బాలరాముడి చిత్ర పటంతో ఫ్లెక్సీలు, బ్యానర్లు, జెండాలు, అరటి చెట్లు, మామిడి తోరణాలతో పండుగ వాతావరణం ఉట్టిపడేలా అలంకరణలు జరుగుతున్నాయి.

రామాలయం శుద్ధి

శ్రీకాళహస్తి: దేవాలయ స్వచ్ఛ తీర్థ్‌లో భాగంగా ఆదివారం పట్టణంలోని సన్నిధివీధిలోని రామాలయాన్ని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ ఆధ్వర్యంలో శుద్ధి చేశారు. ఆలయ ఆవరణలోని శ్రీవీరాంజనేయస్వామి విగ్రహానికి అభిషేకం చేసి పూలమాలలు వేసి సుందరంగా అలంకరించారు. బీజేపీ నాయకులు గరికపాటి రమేష్, ఎస్వీ రమణ, మేళాగారం సుబ్రహ్మణ్యంరెడ్డి, కొండేటి గోపాల్, కోనేటి అయప్ప, ప్రేమ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులు ఆత్మీయ కలయిక


ఆత్మీయ సమ్మేళనమైన పూర్వ విద్యార్థులు

వరదయ్యపాళెం: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో 1990–91 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఒక్కటయ్యారు. స్థానిక గోవర్ధనపురం పాఠశాల ఆవరణ వేదికగా ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు బి.మునస్వామి (హిందీ), రసూల్ సాహెబ్ (ఇంగ్లిష్), ఏవీవీ సత్యనారాయణ (డ్రాయింగ్), మునీంద్రయ్య (పీఈటీ), సుబ్రమణ్యం (గణితం), రమణారెడ్డి (సామాన్యశాస్త్రం)ని ఘనంగా సత్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో పాఠశాల అభివృద్ధికి చేయూతనివ్వాలని నిర్ణయించారు. పూర్వ విద్యార్థులు నాగప్రసాద్, సల్లా వీరభద్రయ్య, మురుగయ్య, రాకేష్, గణేష్, శారద, జయసుధ తదితరులు పాల్గొన్నారు.

మేనమామ సాంగ్యం పంపిణీ


నూతన జంటకు మేనమామ సాంగ్యం అందిస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

రేణిగుంట: రేణిగుంట రైల్వే కల్యాణ మండపంలో ఆదివారం వివాహం చేసుకున్న ముస్లిం జంటకు వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి మేనమామ సాంగ్యం పంపిణీ చేశారు. ముస్లిం యువకుడి వివా హం జరుగుతున్నట్లు తె లుసుకున్న ఎమ్మెల్యే బి య్యపు మధుసూదన్‌రెడ్డి ఆనవాయితీగా మేనమామ సాంగ్యం కింద మంచం, బీరువా, టీవీ పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలో వివా హం చేసుకున్న ముస్లిం పేద వర్గానికి చెందిన జంటలకు ఎమ్మెల్యే నాలుగేళ్లుగా మేనమామ సాంగ్యం పంపిణీ చేస్తున్నారని ఆమె గుర్తు చేశారు. నూతన వధూవరులకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, సర్పంచ్ నగేషం, ముస్లిం మైనార్టీ మండల అధ్యక్షుడు అబ్దుల్ ఖదీర్, కోఆప్షన్ సభ్యుడు హసన్ సాహెబ్, జాన్‌బాబు, రఫీవుల్లా పాల్గొన్నారు.

విజయసాయిరెడ్డికి ముక్కంటి ప్రసాదాలు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఏపీసీడ్స్ కూడలి వద్ద ఎంపీ విజయసాయిరెడ్డికి ఆదివారం ఘన స్వాగతం లభించింది. సూళ్లూరుపేటలో సభ కోసం రోడ్డు మార్గాన వెళుతున్న ఆయనకు ఏపీసీడ్స్ వద్ద ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె, వైఎస్సార్ సీపీ నాయకురాలు పవిత్రారెడ్డి స్వాగతం పలికారు. ఆయనను ముక్కంటి శేషవస్త్రంతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు సురేష్‌కు సత్కారం



శ్రీకాళహస్తి : మండలంలోని ఊరందూరు జెడ్పీ ఉన్నత పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు కూనాటి సురేష్‌ను ఆంధ్రప్రదేశ్ పరీక్షల విభాగం సంచాలకులు దేవానందరెడ్డి సత్కరించారు. శ్రీకాకుళంలో ఆదివారం రాష్ట్రస్థాయి సాంఘికశాస్త్ర విద్యా వైజ్ఞానిక సదస్సు నిర్వహించారు. సాంఘికశాస్త్రంలో ఆరు నుంచి తొమ్మిది తరగతులకు సంబంధించిన పాఠ్యాంశాల పవర్ పాయింట్‌లను సిద్ధం చేసి డిజిటల్ విద్యను ప్రోత్సహించడంలో కృషి చేసిన సురేష్‌ను ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన దేవానందరెడ్డి సత్కరించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. రాష్ట్రంలోని 26 జిల్లాలకు చెందిన సాంఘిక ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోడిపందెం రాయుళ్ల అరెస్టు

వరదయ్యపాళెం: మండలంలోని కువ్వాకొల్లి గ్రామంలో ఆదివారం కోడిపందేల స్థావరంపై ఎస్‌ఐ నాగార్జునరెడ్డి సిబ్బంది దాడి చేశారు. ఈ సందర్భంగా పందెం ఆడుతున్న పది మందిని అదుపులోకి తీసుకున్నారు. రూ.4,650, ఆరు కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఏఎస్‌ఐ షణ్ముగం, సిబ్బంది హరి, గణేష్, సుధీర్ రెడ్డి, కిరణ్, సుబ్బు పాల్గొన్నారు.

వైభవంగా ఏకాదశి ఉత్సవం


ఊరేగింపులో స్వామి, అమ్మవార్లు

నారాయణవనం: శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఏకాదశిని పురస్కరించుకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవర్లు తిరుచ్చిపై పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఉదయం సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచి నిత్యపూజా కైంకర్యాలను నిర్వహించారు. ఏకాదశి గడియల్లో అర్చన పూజలు చేశారు. సాయంత్రం శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవరులను సర్వాంగ సుందరంగా అలంకరించి తిరుచ్చి వాహనం కొలువుదీర్చి మాడ వీధుల్లో ఊరేగించారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవర్లకు ఆస్థానం నిర్వహించి నైవేద్య సమర్పణం చేశారు. ఆలయ అర్చితం అధికారి భరత్ పర్యవేక్షించారు.

క్రికెట్ విజేత చిందేపల్లె జట్టు


మెమెంటోతో విజేత జట్టు

ఏర్పేడు: మండలంలోని చిందేపల్లెలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన క్రికెట్ ఫైనల్స్‌లో చిందేపల్లె జట్టు విజేతగా నిలిచింది. సంక్రాంతి సందర్భంగా శ్రీసిద్ధేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త గిరిధర్ రెడ్డి ఆధ్వర్యంలో 15 రోజుల క్రికెట్ టోర్నమెంట్ జరిగింది. పలు గ్రామాల నుంచి 40 జట్లు టోర్నమెంట్‌లో పాల్గొన్నాయి. ఆదివారం చిందేపల్లె, దుర్గిపేరి జట్ల మధ్య ఫైనల్స్ జరిగాయి. చిందేపల్లె జట్టు విజయం సాధించడంతో మెమెంటోతో పాటు రూ.12 వేల నగదు బహుమతిని అందజేశారు. ప్రోగ్రాం నిర్వాహకులు సురేష్‌బాబు, శ్రీను, ఢిల్లీ, చెంచురామ్, తిరుమల, గోపాల్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా గౌరమ్మ నిమజ్జన ఊరేగింపు


గౌరమ్మ దేవతను ఊరేగిస్తున్న మహిళలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని చిన్నపాలేడు గ్రామంలో గౌరమ్మ నిమజ్జనం కార్యక్రమం కోలాహలంగా జరిగింది. గౌరమ్మ దేవతకు మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. ప్రతిమ చుట్టూ మహిళలు గొబ్బిళ్లు తట్టి, భక్తిగీతాలు పాడారు. గౌరమ్మను ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. అన్నదానం చేశారు. తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం గౌరమ్మ ఊరేగింపుగా తీసుకెళ్లి చెరువులో నిమ్మజ్జనం చేశారు. రిటైర్డు ఎస్పీ రమేషయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

పచ్చాలమ్మ దేవతకు పొంగళ్లు


పచ్చాలమ్మ దేవతకు హారతి

మండలంలోని పల్లమాల గ్రామంలోని పచ్చాలమ్మ ఆలయంలోని శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకం అనంతరం అమ్మవారిని విశేషంగా అలంకరించి పూజలు చేశారు. గ్రామస్తులు పొంగళ్లు పెట్టి నివేదించారు.

నివాసప్రాంతాల్లో పందులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలో పందులు సంచరిస్తుండడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పందులు ఇళ్లల్లోకి కూడా వస్తున్నాయి. పాఠశాల ఆవరణలోకి సైతం ప్రవేశిస్తుండడంతో విద్యార్థులు భయభ్రాంతులకు గురిఅవుతున్నారు. హాస్టళ్ల, ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్పత్రుల వద్ద ఉంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలోకి పందులను వదలకుండా యజమానులను అధికారులు హెచ్చరించాలని కోరుతున్నారు.